క్లుప్తంగా

రేపు తాగునీరు బంద్

మల్లాపూర్: మల్లాపూర్ రిజర్వాయర్ ఇన్‌లెట్, అవుట్‌లెట్ వాల్వ్ మరమ్మతుల కారణంగా ఆదివారం పలు కాలనీల్లో తాగునీటి సరఫరా ఉండదని డిప్యూటీ జీఎం సతీష్‌కుమార్ తెలిపారు. నాచారం రాంరెడ్డినగర్, నాచారం ఓల్డ్ విలేజ్, ఎర్రకుంట, హెచ్‌ఎంటీ నగర్, వీఎస్టీ కాలనీ, స్నేహపురి కాలనీ, భవానీనగర్, ఎన్టీఆర్ నగర్, మల్లాపూర్, దత్తాత్రేయనగర్, చాణిక్యపురికాలనీల్లో సరఫరా ఉండదన్నారు.

రేపు రక్తదాన శిబిరం

బోడుప్పల్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి పరాక్రమ దివాస్‌ను పురస్కరించుకుని ఆదివారం వీరారెడ్డినగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు కాలనీ అధ్యక్షుడు నాగేష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి బస్వారెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. వీరారెడ్డి కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు క్యాంప్ ఉంటుందన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా నూతన కమిటీ

మౌలాలి: బీజేపీ వినాయక్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు ఉప్పల ఓంప్రకాష్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మీ, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రచార కార్యదర్శి జిల్లెల రవియాదవ్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మంగేష్ అధ్యక్షతన శుక్రవారం బీజేపీ ఓబీసీ మోర్చా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాము ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా శశిగౌడ్, వెంకటేష్, వడ్డెర రాజు, కవిత, ప్రధాన కార్యదర్శులుగా రామ్‌ప్రసాద్ ముదిరాజ్, శివగౌడ్, కార్యదర్శులుగా రమేష్‌యాదవ్, నరేందర్, నిఖిల, సహాయ కార్యదర్శిగా సూర్యకాంత్ బిరదర్, మిథున్, కోశాధికారిగా కిరణ్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు.

గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



గ్రామీణ సదస్సులో సావనీర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

అల్వాల్: దేశానికి గ్రామాల అభివృద్ధి కీలకమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో అమలవుతున్న వివిధ పథకాలపై గ్రామీణ అభివృద్ధికి దోహదపడే అంశాలపై చర్చించడానికి నేరేడ్‌మెట్‌లోని మల్కాజిగిరి ప్రభుత్వ కళాశాలలో రెండు రోజుల పాటు సదస్సు నిర్వహించారు. శుక్రవారం ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. వచ్చే ఏడాదిలోగా మల్కాజిగిరిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రత్యేక భవనాన్ని నిర్మించడానికి చర్యలు తీసుకుంటానన్నారు. ఇందుకోసం రెండు ఎకరాల స్థలం కేటాయించినట్లు తెలిపారు. ఇటీవల కళాశాలకు తాగునీటి సౌకర్యం, రోడ్డు నిర్మాణం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీవి చైర్ పర్సన్ ఇంద్రకాంత్, ప్రొఫెసర్ క్రిష్టారెడ్డి, డాక్టర్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ జ్యోతిరావు, చంద్రయ్య, డాక్టర్ ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే, కార్పొరేటర్లకు వినతి పత్రం అందజేస్తూ..

అల్వాల్: నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని యాప్రాల్ పరిధిలోని సీబీఆర్ కాలనీలోని వాంబే గృహాలను శుక్రవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, స్థానిక కార్పొరేటర్ మీనా ఉపేందర్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యతో పాటు విద్యుత్ స్తంభాలు తదితర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు ఎమ్మెల్యే, కార్పొరేటర్‌ను కోరారు. అనంతరం యాప్రాల్ మెహర్‌బాబా కాలనీ సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కృష్ణమూర్తి, భాస్కర్, శ్రీనివాస్, ఉదయ్ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. సమస్యలు పరిష్కరించాలని వారు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జలమండలి జీఎం సునీల్‌కుమార్, డీఈ మహేష్, ఏఈ సృజన, నాయకులు ఉపేందర్‌రెడ్డి, ఎస్.మహత్యవర్ధన్, ఎస్సార్ ప్రసాద్, చిత్రగోకుల్, సతీష్, చెన్నారెడ్డి, మహేష్, శివకాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నవ చండీ మహాయాగం



అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ సాయిసూర్య కాలనీలో నిర్మించనున్న వాసవిమాత ఆలయ స్థలంలో శుక్రవారం నవ కుండాత్మక నవ చండీ మహాయాగం నిర్వహించారు. సంస్కృతి సంస్కార ఆధ్యాత్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన యాగంలో పలు ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, టీఎస్‌టీడీసీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త, కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్‌రెడ్డి, సబిత అనిల్‌కిషోర్, సంఘ సభ్యులు రాంబాబు, శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రుద్రహోమం

గౌతంనగర్: మాస శివరాత్రి సందర్భంగా ఉత్తంనగర్ దుర్గా జ్యోతిష్యాలయంలో శుక్రవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, రుద్రహోమం నిర్వహించారు. నిర్వాహకులు మూగు నాగరాజు శర్మ, భక్తులు పాల్గొన్నారు.



మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట



డ్రైనేజీ పనుల శంకుస్థాపనలో మేయర్ బుచ్చిరెడ్డి

బోడుప్పల్: మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. చెంగిచర్ల 2వ డివిజన్‌లోని బృందావన్ కాలనీలో రూ.11.50 లక్షలు, 3వ డివిజన్‌లోని ఆర్టీసీ కాలనీలో రూ.8లక్షలతో శుక్రవారం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనకు పెద్దఎత్తున కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్, కార్పొరేటర్ కొత్త చందర్‌గౌడ్, కో ఆప్షన్ సభ్యులు రంగ బ్రహ్మన్నగౌడ్, సీనియర్ నాయకులు కొత్త రవిగౌడ్, కొత్త గోపాల్‌గౌడ్, ఆర్టీసీ కాలనీ ప్రధాన కార్యదర్శి గణేష్ నాయక్, కోశాధికారి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు వేయించాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని రాజీవ్ పార్క్ పక్కన వీధిలో సీసీ రోడ్డు వేయించాలని కోరుతూ కాలనీవాసులు శుక్రవారం జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌కు వినతి పత్రం అందజేశారు. అధికారులతో మాట్లాడి సీసీ రోడ్డు వేయిస్తామని ఆమె హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో కాలనీ అధ్యక్షుడు సయ్యద్ నజీర్, కార్యదర్శి ఎండీ నవబ్ జాన్, ఎస్వీస్ శర్మ, వెంకటరత్నం, మురళి గౌడ్ తదితరులు ఉన్నారు.

మహిళ హత్య కేసులో ఇద్దరి అరెస్టు

మల్కాజిగిరి: మహిళను హత్య చేసిన ఇద్దరిని మల్కాజిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ జగదీశ్వర్ వివరాల ప్రకారం.. మౌలాలి భరత్‌నగర్‌కు చెందిన మహిళ(38) ఓయూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లాలాపేట్‌లో ఉన్న కల్లు దుకాణానికి వచ్చి అదృశ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఓయూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 16వ తేదీన మౌలాలి రైల్వే స్టేషన్ వెళ్లే మార్గంలో రైల్వే ఖాళీస్థలంలో (మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధి) మహిళ మృతదేహాన్ని గుర్తించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసిన మల్కాజిగిరి పోలీసులు శుక్రవారం హత్యకు పాల్పడిన నాచారం బాబానగర్‌కు చెందిన లారీ డ్రైవర్ బానోతు రాజు(28), సహకరించిన సయ్యద్ గౌస్(68) ఇద్దరినీ అరెస్టు చేశారు. కాల్‌డేటా, సీసీ పుటేజీ ఆధారంగా హంతకులను గుర్తించామని, మహిళపై రాజు లైంగికదాడికి పాల్పడి హత్య చేశాడని, సయ్యద్ గౌస్ సహకరించాడని సీఐ తెలిపారు.

అభివృద్ధే లక్ష్యం

- పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి
- సాధారణ సర్వసభ్య సమావేశంలో మేయర్
- 22 అంశాల ఏజెండాకు ఏకగ్రీవ తీర్మానం



మాట్లాడుతున్న మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

మేడిపల్లి: ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు భవిష్యత్ అవసరాల కోసం అనేక పనులు చేపడుతూ దేశంలోనే అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దుతున్నట్లు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ల సమావేశంలో 22అంశాలతో కూడిన ఎజెండాను ప్రవేశపెట్టారు. అనంతరం మేయర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛ్ సర్వేక్షణ్–2022లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన రూ.2 కోట్లు శానిటేషన్ విభాగానికి ఆటోల కొనుగోలు, వార్డుల వారీగా కంపోస్టు కేంద్రాల ఏర్పాటు, డీఆర్‌సీసీ సెంటర్ అభివృద్ధికి జేసీబీ కొనుగోలు, కమాండ్ కంట్రోల్ సెంటర్ ఆధునీకరణ, స్వచ్ఛ వలంటీర్ల గౌరవ వేతనం కేటాయిస్తూ ప్రతిపాదనలను పంపించడం జరిగిందన్నారు. తాగునీటి సమస్య లేకుండా అవసరమైన చోట పైప్‌లైన్లతో పాటు జంక్షన్ నిర్మించడం, వీధి వ్యాపారుల కోసం నిర్మిస్తున్న స్ట్రీట్ వెండర్ల దుకాణాలను త్వరలో పూర్తిచేసి అర్హులకు అందజేస్తామన్నారు. ఆయా డివిజన్లలో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయడం, పలు డివిజన్లలో కరెంటు స్తంభాలు ఏర్పాటుతో పాటు ఇంటర్ పోల్స్, వివిధ కాలనీల్లో గుంతలకు మరమ్మతులు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగాలని మేయర్ కార్పొరేటర్లకు పిలుపునిచ్చారు. కమిషనర్ రామకృష్ణారావు, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది, జల మండలి, విద్యుత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొన్ని వార్డుల పట్ల వివక్ష

కార్పొరేటర్ పిట్టల మల్లేష్ అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్న ప్రదర్శనలో కార్పొరేటర్ పిట్టల మల్లేష్

మేడిపల్లి: పీర్జాదిగూడ కార్పొరేషన్ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ కార్పొరేటర్లను కించపరిచే విధానాలను అవలంబిస్తున్నారని 21వ వార్డు కార్పొరేటర్ పిట్టల మల్లేష్ శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. అంతకుముందు ఆయన వార్డు పరిధిలోని మద్దతుదారులతో ఉప్పల్ బస్ డిపో నుంచి మేడిపల్లి కౌన్సిల్ హాల్ వరకు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. కౌన్సిల్ హాల్‌లో జరిగిన సమావేశంలో పాల్గొని బైకాట్ చేసి మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పిట్టల మల్లేష్ విలేకరులతో మాట్లాడారు. మూడు సంవత్సరాలుగా తన వార్డు సమస్యలను కమిషనర్, మేయర్, అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని, తన వార్డు పట్ల వివక్ష చూపుతున్నారని అన్నారు. ఈ విషయాన్ని పలు సందర్భాల్లో కౌన్సిల్‌లో ప్రశ్నించినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని అన్నారు. మేయర్‌కు నచ్చిన కార్పొరేటర్లకు లక్షలాది రూపాయల పనులు కేటాయిస్తున్నారని ఆరోపించారు. ఈ కారణాలతోనే వార్డు ప్రజల పక్షాన అర్ధనగ్న ప్రదర్శన చేసినట్లు తెలిపారు. ఆతడికి మద్దతుగా డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, కార్పొరేటర్ కొల్తూరి మహేష్, నాయకులు పాశం బుచ్చియాదవ్, సత్యనారాయణ, యాసారం మహేష్ మద్దతు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి సంఘీభావం ప్రకటించారు.

పనులపై దృష్టి సారించండి



సమావేశంలో కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: డివిజన్‌లో పెండింగ్ పనులపై దృష్టి సారించాలని మల్కాజిగిరి సర్కిల్ డీసీని కార్పొరేటర్ శ్రవణ్ కోరారు. డీసీ చాంబర్‌లో ఇంజనీరింగ్ విభాగం ఏఈ, సిబ్బందితో శుక్రవారం సమావేశమయ్యారు. ఇప్పటికే సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమై నిధులు మంజూరైన వాటిని ప్రారంభించాలన్నారు. కొన్ని కాలనీల్లో కొత్త రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, వేసవిలో పనులు పూర్తి చేయాలన్నారు. సఫిల్‌గూడ లేక్ పార్కులో హెచ్‌ఎండీఏ నిర్వహణలో టాయిలెట్స్ అధ్వానంగా ఉన్నాయని, వాటిపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఏఈ మధురిమ, వీఐ రమేష్, టింకూ పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయండి



డీసీ నాగమణికి వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అల్వాల్: వెంకటాపురం ప్రధాన రహదారి రోడ్డు ఏర్పాటు పనులు పూర్తి చేయాలని అల్వాల్ సర్కిల్ కాంగ్రెస్ నాయకులు జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. వెస్ట్ వెంకటాపురం ప్రాంతానికి వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండటంతో ప్రయాణికులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. వెంటనే రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం అల్వాల్ సర్కిల్ ఉపకమిషనర్ నాగమణికి వినతి పత్రం అందజేశారు. నాయకులు అశోక్ రెడ్డి, సీఎల్.యాదగిరి, శ్రీనివాసులు, వీనస్‌మేరి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



హేమంత్ మృతదేహం

అల్వాల్: ఇనుప రాడ్లను దొంగతనం చేయడానికి ప్రయత్నించి గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కర్నాటక రాష్ట్రానికి చెందిన కేహెచ్.హేమంత్(23) నగరానికి వలస వచ్చి నేరేడ్‌మెట్‌లో నివాసం ఉంటున్నాడు. గతేడాది నవంబర్ 21వ తేదీన నేరేడ్‌మెట్ శివానగర్ నిర్మాణంలో ఉన్న భవనం రెండో అంతస్తులో ఇనుపరాడ్లు దొంగతనం చేస్తుండగా ఇంటి యజమాని చూశాడు. పారిపోవడానికి ప్రయత్నంలో భాగంగా రెండో అంతస్తు నుంచి కిందకు దూకాడు, తల, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



మహిళలతో రాగిడి లక్ష్మారెడ్డి

ఉప్పల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, మధుర చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. చిలుకానగర్‌లో ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ప్రతి మహిళ స్వశక్తితో ఎదగాలన్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి వంజరి సంతోష్, మేకల శివారెడ్డి, దాసరి కృష్ణ, బూర్గుల రమేష్‌గౌడ్, షేక్ మదర్ వలీ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదువుకోండి



మేడిపల్లి: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే లక్ష్యాలను చేరుకోవచ్చని ప్రముఖ మోటివేటర్ వేణుకళ్యాణ్ అన్నారు. స్థానిక తిరుమల గార్డెన్‌లో ట్రస్మా మేడిపల్లి మండల ప్రతినిధుల ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మోటివేటర్ వేణుకళ్యాణ్ హాజరై మాట్లాడారు. పరీక్షలకు రెండు నెలల సమయం ఉన్నందున చదువుపై దృష్టి పెట్టాలన్నారు. మేడిపల్లి మండల శాఖ ట్రస్మా అధ్యక్షుడు సామ అశోక్‌రెడ్డి, ప్రతినిధులు మధుకర్, సురేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, నరేందర్, నాగరాజు, జితేందర్‌రెడ్డి, నిర్మలారెడ్డి, కవిత విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్ట్రీట్ వెండర్స్ సమస్యలను పరిష్కరించాలి

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో ఉన్న స్ట్రీట్ వెండర్స్ సమస్యలు పరిష్కరించాలని అసోషియేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆనంద్‌బాగ్‌లో నేషనల్ స్ట్రీట్ వెండర్స్ డే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోషియేషన్ అధ్యక్షుడు బాజీ భాషా మాట్లాడుతూ చిరువ్యాపారాలతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారని, ఇటీవల చిరు వ్యాపారులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సాజిద్, జేమ్స్ జాన్, యాదగిరి, నరేష్, సుజాత, సువర్ణ, ఎల్లమ్మ ఉన్నారు.



దేవాలయ అభివృద్ధికి కృషిచేస్తా



ఆలయ కమిటీ సభ్యులతో చెవూరి అరుణ, సుదర్శన్

మల్లాపూర్: మాతా జగజ్జనని ముగ్గురమ్మల దేవాలయం అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని చేవూరి వాస్తు జ్యోతిష ఆధ్యాత్మిక నిలయం చేవూరి అరుణ సుదర్శన్ అన్నారు. చేవూరి కుటుంబ సభ్యులు ఉషశ్రీ సహకారంతో గోకుల్‌నగర్‌లోని మాతా జగజ్జనని ముగ్గురమ్మల దేవాలయం ప్రాంగణంలో సొంత డబ్బులతో దేవాలయం బోర్డును ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కారించారు. ఆలయ కమిటీ సభ్యులు టి.మల్కయ్య, శివరాం ప్రసాద్, వెంకట్‌రెడ్డి, రాజు, శేఖర్‌రావు, వెంకటేష్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం



జానకమ్మ(ఫైల్)

అల్వాల్: వృద్ధురాలు అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. వాజ్‌పేయినగర్‌లో నివాసముండే రాగుల జానకమ్మ(85) గురువారం ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు నేరేడ్‌మెట్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

నెలలతరబడి' చెత్త.. అధికారులకు పట్టదా..?



కుషాయిగూడ బడి ఆవరణలో చెత్తకుప్పలు పేరుకుపోయాయి. దీంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. నిత్యం విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

– కుషాయిగూడ